క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి


బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, రత్నమయ్య డిమాండ్ చేశారు. బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్నవారికి పని దినాలు పెంచాలన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ఉపాధి పనులు చేసే చోట ప్రమాదానికి గురైన వారికి రూ.25 లక్షలు పరిహారంఇవ్వాలని కోరారు. అనంతరం వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సుంకులమ్మ గుడి ప్రతిష్ట


పూజలందుకున్న సుంకులమ్మ అమ్మవారు

నందికొట్కూరు: మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో సుంకులమ్మ గుడి ప్రతిష్ట వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన సుంకులమ్మ ఆలయ ప్రతిష్ట వేడుకల్లో గ్రామస్తులతో పాటు టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


సచివాలయం వద్ద అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పాములపాడు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం ద్వారా ముఖ్యమంత్రికి పంపాలని కోరుతూ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనువాసులుకు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని పంటల ధరలు పడిపోయాయని పేర్కొన్నారు. రైతాంగం తీవ్ర సంక్షోభానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పంట దిగుబడులు గత ఏడాదితో పోలిస్తే 50శాతం కూడా ధర లేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి ఈ ఏడాది రద్దు చేసిందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేవలం ఒకటి, రెండు పంటల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశాయని దీంతో మిగతా పంటు సాగు చేసిన రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సంయుక్త కిసాన్ పిలుపులో భాగంగా నిరసన తెలియజేస్తూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రికి విన్నవిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు సుబ్బారెడ్డి, సురేష్, శ్రీనివాసులు, షర్పతుల్లా, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల, రైతాంగం సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు, రైతు సంఘం నాయకులు ఎస్ సంజీవ రాయుడు, దాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని ముసలమడుగు, పెద్ద గుమ్మడాపురం, శివపురం, గ్రామ సచివాలయాల ఎదుట నిరసన తెలియజేసి వినతి పత్రాలు సచివాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, సత్యరాజు, చిన్న చిన్నయ, దేవకుమార్ పాల్గొన్నారు.

పనిచేసిన వారికి ప్రాధాన్యం

● కష్టపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మండల కమిటీలో చోటు



పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యం ఇచ్చింది. మండల కమిటీలలో చోటు కల్పించి మరింత బాధ్యతను పెంచింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మంగళవారం శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని మండల కమిటీలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. – ఆత్మకూరు/నందికొట్కూరు

మిడుతూరు మండల కమిటీ..
వైఎస్సార్‌సీపీ మిడుతూరు మండల వైస్ ప్రెసిడెంట్లుగా పి.స్వామిరెడ్డి, ఎం.అన్వర్‌బాషా, జనరల్ సెక్రటరీలుగా సి. అంజి, సయ్యద్ షాదిక్ ఆలీ, ఎం.అన్వర్‌బాషా, కె.నాగిరెడ్డి, సెక్రటరీలుగా డి.వెంకటేశ్వర్లు, వై.నాగోషిరెడ్డి, టి.సాంబశివుడు, డి.మహబూబ్‌బాషా, ఎస్.అహమద్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 34 మంది ఎంపికయ్యారు.

కొత్తపల్లి మండలం..
కొత్తపల్లి మండల వైస్ ప్రెసిడెంట్లుగా పి.నారాయణరెడ్డి, జె.మహబూబ్‌బాషా, జనరల్ సెక్రటరీలుగా జి. అల్తాఫ్, టి.నాగరత్నం, ఎస్. రామిరెడ్డి, బి.జగదీశ్వరరెడ్డి, సెక్రటరీలుగా జె.మునిరంగ, సి.శ్రీనివాసులు యాదవ్, కె.అచ్చిరెడ్డి, పి.వెంకటరెడ్డి, కె.మల్లికార్జునరెడ్డితో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 34 మంది ఎంపికయ్యారు.

పాములపాడు మండలం
పాములపాడు మండల వైస్ ప్రెసిడెంట్స్‌గా బి.కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా శేఖర్, చరణ్, కృష్ణారెడ్డి, కమలాకర్, సెక్రటరీలుగా పి.శ్రీను, మాలిక్‌బాషా, బాలసుబ్బారెడ్డి, కురుంద సురేష్, గొల్ల శ్రీనుతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 13 మంది ఎంపికయ్యారు.

ఆత్మకూరు మండలం
ఆత్మకూరు మండల వైస్ ప్రెసిడెంట్లుగా ఈశ్వర్‌రావు, మహేష్‌రావు, జనరల్ సెక్రటరీలుగా భాస్కర్, శ్రీనివాసగౌడ్, కె.నాగేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీలుగా శివారెడ్డి, మాణిక్యం, రాజశేఖర్, వెంకటేశ్వరనాయక్, అజీబ్‌బాషాతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 13 మంది ఎంపికయ్యారు.

మహానంది మండలం..
మహానంది మండల వైస్ ప్రెసిడెంట్లుగా రాజు, అశోక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా బొజ్జయ్య, నాగేశ్వరరెడ్డి, కొండయ్య, బాలయ్యగౌడ్, సెక్రటరీలుగా రమేష్, రమేష్‌రెడ్డి, మౌలీశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, విశ్వనాథరెడ్డితోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 12 మంది ఎంపికయ్యారు.

వెలుగోడు మండలం..
వెలుగోడు మండల వైస్ ప్రెసిడెంట్లుగా రమణ, ముర్తుజావలి, జనరల్ సెక్రటరీలుగా సుదర్శన్‌నాయుడు, పిల్లల మహ్మద్‌హుసేన్, బండి సురేష్‌కుమార్, నిరంజన్, సెక్రటరీలుగా మహబూబ్‌బాషా, నారాయణ, చిన్నమస్తాన్, శంకర్‌నాయక్, రఘుస్వామిరెడ్డితోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 14 మంది ఎంపికయ్యారు.

● **పగిడ్యాల మండలం..**
పగిడ్యాల మండల వైస్ ప్రెసిడెంట్లుగా పి.రమణ ప్రసాద్, ఎస్.నాగస్వామి, జనరల్ సెక్రటరీలుగా పి.భాస్కర్‌రెడ్డి, పాలూరి వెంకటేశ్వర్లు, పసుల వెంకటేశ్వర్లు, ముర్తుజావలి, సెక్రటరీలుగా కిశోర్‌రెడ్డి, పెరుమాళ్ల సుధాకర్, జె.గణేష్‌రెడ్డి, బీజ వెంకటేశ్వర్లు, వజీర్‌బాషాతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 35 మంది ఎంపికయ్యారు.

● **ఆత్మకూరు మున్సిపాలిటీ..**
ఆత్మకూరు మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్లుగా సోమశేఖర్, వెంకటస్వామిగౌడ్, జనరల్ సెక్రటరీలు ఆంజనేయులు, అల్లీషేర్, షంషూర్‌ఆలీ, శ్రీనివాసరెడ్డి, సెక్రటరీలు లాలు(నూర్‌అహ్మద్), నరేష్, శివయ్య, షేక్‌రఫిక్, చంద్రతోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 27 మంది ఎంపికయ్యారు.

● **శ్రీశైలం మండలం..**
శ్రీశైలం మండల వైస్ ప్రెసిడెంట్లుగా వి.బుద్దయ్య, సీహెచ్ పుల్లయ్య, జనరల్ సెక్రటరీలుగా బి.గౌస్‌మోహిద్దీన్, ప్రభాకర్, లోకేష్‌చౌదరి, మహేంద్ర, సెక్రటరీలుగా సీహెచ్ కోదండం, నరేష్‌కుమార్, శంకర్, వెంకటేశ్వర్లు, సంజీవయ్యతోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 24 మంది ఎంపికయ్యారు.

● **బండి ఆత్మకూరు మండలం ..**
బండిఆత్మకూరు మండల ప్రెసిడెంట్ బారెడ్డి భాస్కర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా చంద్రరాయుడు, బి.బాబు, ప్రధాన కార్యదర్శులుగా గోపాల్‌రెడ్డి, ఉసేన్‌బాషా, శివలింగం, బాలీశ్వరరెడ్డి, సెక్రటరీలుగా ఎన్.సుబ్బారెడ్డి, శిరోమణి, రవినాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, మద్దిలేటితోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 16 మంది ఎంపికయ్యారు.

రేపు దేవస్థానం భూములకు కౌలు వేలం

ఆత్మకూరు: బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలోని ముక్తి ఈశ్వర స్వామి దేవస్థాన భూములు కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 22న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నాగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.1,000 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. అలాగే శ్రీలక్ష్మీ జన్నాన స్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాల భూములకు, బి.కోడూరు చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన భూములకు ఈ నెల 24న వేలంపాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

మహానంది: పంటలకు మద్దతు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకుడు రామచంద్రుడు, సీపీఎం మండల కార్యదర్శి కోటకొండ బాషా డిమాండ్ చేశారు. గాజులపల్లె గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్‌బాషాకు వారు వినతిపత్రం అందజేశారు. అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీపీఎం నాయకులు ఉశేన్, మద్దిలేటి పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం

నంద్యాల(వ్యవసాయం): మైసూర్ దత్త పీఠాధిపతి, అవధూత గణపతి సచ్చిదానంద స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో నంద్యాలకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మురళీ సతీమణి మానస వీణ బంగారు పథకం సాధించింది.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


పెద్దదేవుళాపురంలోని ఏకశిల అభయాంజనేస్వామి ఆలయంలో ప్రతిష్ట పూజలు చేస్తున్న పండితులు


పూజల్లో పాల్గొన్న శిల్పా భువనేశ్వరరెడ్డి

గడివేముల: బండిఆత్మకూరు మండల పరిధిలోని పెద్దదేవుళాపురం గ్రామంలో వెలసిన ఏకశిల అభయాంజనేయ స్వామి ఆలయంలో దేవతల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయ నిర్వాహకులు శివరాజు నాయక్, నాగేశ్వరరావు నాయక్, తేజ నాయక్‌ల ఆధ్వర్యంలో వేదపండితులు ప్రతిష్ట, నవగ్రహ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, భోజనం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

● ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్


చెంచు గిరిజనులతో ఐటీడీఏ పీఓ

కొత్తపల్లి: గూడేలలో జీవనం సాగిస్తున్న చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని శివపురం చెంచు గూడెంలో 10 రోజుల జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ ప్రతి గిరిజన మహిళ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీడీపీ కన్జర్వేషన్ కమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద ఐటీడీఏ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం చెంచుగూడెంలో చెంచులకు 6 కుట్టు, కటింగ్ మిషన్లు ఇస్తామన్నారు. చెంచులు తయారుచేసిన బ్యాగులను మార్కెటింగ్ చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గుండల నాయక్, హార్టికల్చర్ అధికారి ధనుంజయ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న, ఐటీడీఏ ఏపీఓ రాజు నాయక్, సీసీ యూసఫ్ పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

పాములపాడు: వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ సురేష‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటరు సమీపంలో కేజీ రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సరైన ధ్రువపత్రాలు లేని వారి నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. ఎస్‌ఐ వెంట ఏఎస్‌ఐ జోషఫ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నెహ్రూనగర్‌లో గ్రామసభ


నెహ్రూనగర్‌లో విచారణ చేపట్టిన తహసీల్దార్ శివరాముడు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో తహసీల్దార్ శివరాముడు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి చెందిన కానుగల శ్రీనివాసులు మరి కొంత మంది దళితులు నీటి మునక భూముల వేలం పాటల్లో దళితులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గ్రామంలో పోలీసు బందోబస్తు మధ్య గ్రామసభ చేపట్టారు. ఈ గ్రామసభకు వీరాపురం, అర్లపాడు, మూర్వకొండ, పీకే ప్రాగటూరు గ్రామాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు హజరయ్యారు. కానుగల శ్రీనివాసులు సమక్షంలోనే తహసీల్దార్ విచారించి గ్రామానికి ఇద్దరి వాంగ్మూలాలను సేకరించారు. ఇప్పటి వరకు నిర్వహిస్తూ వస్తున్న వేలం పాటలకు సంబంధించిన రికార్డుల జిరాక్స్ కాపీలు అందజేయాలని సూచించారు. గ్రామసభలో సేకరించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతున్నామని తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నీటి మునక భూముల్లో ఎవ్వరు దిగరాదని ఆదేశించారు. ఎవ్వరు కూడా గొడవలు పెట్టుకోరాదని అలా జరిగితే 145 జీవోను జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ చంద్రశేఖర్, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు వెంకటస్వామి, హేమలత, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి


అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పగిడ్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు దినసరి వేతనాలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం –2 ముందు కూలీలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలు నివారించి సొంత గ్రామంలోనే పనులు చూపించాలనే ఆశయంతో అమలయ్యే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. అందుకే బడ్జెట్ కేటాయింపుల్లో ఉపాధి హామీ పథకానికి తక్కువ బడ్జెట్ కేటాయించారని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు కూలీలకు 8 వారాల బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడం అందుకు నిదర్శనమన్నారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా పని దినాలు కల్పించి రోజుకు రూ.600లు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలోని గ్రామ వ్యవసాయ సహాయ అధికారిణి వసంతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సునీల్, నాగరాజు, జయమ్మ, రత్నమ్మ, రాధమ్మ, మరియమ్మ, అరుణమ్మ, రాణేమ్మ, నాగన్న, జయరాజు, స్వాములు తదతరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి

ఆత్మకూరు: పట్టణంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, దేవస్థాన కమిటీ అధ్యక్షులు మారం మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వీరాంజనేయస్వామి జయంతి సందర్భంగా ఉదయం స్వామివారికి అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, కుంకుమార్చన, మహామంగళహారతి కార్యక్రమాలతో పాటు సాయంత్రం స్వామివారికి తొట్టు ఉత్సవం, మహామంగలహారతి, పానకపందారం కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణానికి దాతలు సహకరించాలన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఉచిత సేవలు ఉత్తుత్తే!

● ఒక్కో సేవకు రూ.50 చలానా తీసుకుంటూ రశీదు ఇవ్వని సచివాలయ ఉద్యోగులు

జూపాడుబంగ్లా: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామసచివాలయాల్లో ఉచిత సేవలు ప్రజలు అందడం లేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే సత్వరమే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేవారు. ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే దరఖాస్తుదారుడే గ్రామసచివాలయం, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు అందజేస్తే ఒక్కోదానికి సర్వీసుచార్జీ పేరుతో డిజిటల్ అసిస్టెంట్లు రూ.50ల చొప్పున తీసుకుంటున్నా.. రశీదు మాత్రం ఇవ్వడం లేదు. డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్‌లతో సంతకాలు చేయించిన తర్వాత ప్రింట్ చేసిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందజేయాల్సి ఉంది. అయితే ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుకు అనుసంధానించే చెక్‌లిస్టు కూడా ఇవ్వకుండా దరఖాస్తు దారులతో తెప్పించుకుంటున్నారు. ఆన్‌లైన్‌చేసిన దరఖాస్తుపై సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లతో సంతకాలు చేయించి ధ్రువీకరణపత్రాలను ఇవ్వాల్సి ఉంది. అదంత జరగాలంటే 15 రోజుల సమయం పడుతుందని పేర్కొంటూ మీరే సారొళ్లతో సంతకాలు చేయించుకోండని దరఖాస్తుదారులతో పేర్కొంటున్నారు. దీంతో దరఖాస్తుదారుడు పనులన్నీ వదులుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లతో సంతకాలు చేయించుకునే సరికి రెండు, మూడు రోజుల సమయం పడుతుంది. అంతవరకు పనులు వదులుకుని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించే సమయం ఆసన్నమైనందున విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నెటివిటీ, డేట్‌ఆఫ్‌భర్త్, ఈబీసీ, తదితర సర్టిఫికేట్లను అందజేయాలని విద్యార్థులు, గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామ కృష్ణ డిగ్రీ కాలేజీ, శ్రీరాజరాజేశ్వరి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2, ఏపీపీఎస్‌ఈ అన్ని పోటీ పరీక్షలకు రెండు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫ్యాకల్టీతో సమగ్ర కోర్స్ కవరేజ్, మెటీరియల్‌తో నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రత్యేక కోచింగ్ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 23 నుంచి తేదీన ఎంఎస్ ఆఫీసు, వెబ్‌సైట్ డిజైన్ వంటి కోర్స్‌లు నిర్వహించబడుతాయన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 9985240952 నంబరును సంప్రదించాలన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయం నుంచి బస్టాండు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసి సాధించుకున్న హక్కులకు మోదీ ప్రభుత్వం నీరుగార్చడం తగదన్నారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేసి, కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు. అసంఘటితరంగ, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, భవన నిర్మాణ కార్మిక రంగ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు మంజుల, సువర్ణమ్మ, పెద్దనాగరాజు, తిమ్మయ్య, గౌడుగురాజు, రఫీ, హుసేన్‌బాషా, సద్దాం, రవి, వీరన్న, సామేలు, గణపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, చిన్న పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్, పటేల్ సెంటర్ మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు ఉపాధి కూలీలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశర్మకు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. వారం రోజులుగా ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కూలీల జీవనం దుర్భరంగా మారిందన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించి, ఉపాధి పనులు చేసే ప్రాంతంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. పెరుగుతున్న నిత్యాసరాల ధరలకు అనుగుణంగా కూలీలకు వేతనం రోజుకు రూ.600 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, నాగన్న, నజురున్నీసాబేగం, బాబు, రవికుమార్, తిరుపాలప్ప, సరోజ మ్మ, సంజన్న, విజయరాజు, కృష్ణుడు, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభం ఆర్భాటం .. పర్యవేక్షణ శూన్యం

● చలివేంద్రంలో ఖాళీ కుండలు


పాములపాడు బస్టాండ్ సెంటరులో ఏర్పాటు చేసిన చలివేంద్రం


చలివేంద్రంలో దర్శనమిస్తున్న ఖాళీ కుండలు

పాములపాడు: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో అధికారులు ఆర్భాటంగా చలి వేంద్రాన్ని ప్రారంభించి పర్యవేక్షణను గాలికొదిలేశారు. ఈనెల 17న స్వర్ణాంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చలి వేంద్రాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ ఒక్క రోజు మాత్రమే కుండల్లో నీరు నింపారు. మరుసటి రోజు నుంచి కుండల్లో చుక్క నీరు కూడా పోసినట్లు లేరు. కేవలం ప్రచారం కోసమే చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారా అని పలువురు విమర్శిస్తున్నారు. మండల కేంద్రానికి ప్రతి రోజు వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వేసవిలో దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రం ఒక్క రోజుతోనే మమ అనిపించారు. నీళ్లున్నాయని కుండల వద్దకు వెళ్లిన వారికి మూత తీయగానే ఖాళీ కుండలు దర్శనమిస్తుండటంతో ఇదేమి చలివేంద్రమురా బాబూ అంటూ వెనక్కెళ్లిపోతున్నారు. ఈ మాత్రం దానికి పందిరి వేసి కొత్త కుండలు ఏర్పాటు చేయాల అంటూ పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చలివేంద్రాన్ని కేవలం ప్రచారానికి కాకుండా ప్రజలకు దాహార్తి తీర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లి: గుండెపోటుతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ లింగస్వామి కుటుంబాన్ని నంద్యాల పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐ బీఆర్ కృష్ణయ్య, ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్‌ఐ జయశేఖర్ మంగళవారం పరామర్శించారు. ముందుగా లింగస్వామి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ తరఫున రూ.50,000, పోలీసు సంఘం తరఫున రూ.50,000లను ఆయన భార్య సుహాసినికి అందించారు. కాగా బుధవారం పోలీసు లాంఛనాలతో లింగస్వామి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మిక వ్యతిరేకంగా ఉన్న చట్టాలను రద్దుచేయాలి


డిప్యూటీ తహసీల్దార్ నాగన్నకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: కార్మికుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల మెప్పుకోసం కార్మిక చట్టాలను కుదించాలని యత్నిస్తుందని పేర్కొన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దుచేయాలన్నారు. ఉపాధికూలీలకు 200పనిదినాలు కల్పించటంతో పాటు రోజుకు కనీసం రూ.600ల గిట్టుబాటుకూలీ కల్పించటంతో పాటు వ్యవసాయ పనిముట్లు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధిబిల్లులు సత్వరమే చెల్లించాలన్నారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ నాగన్నకు అందజేశారు.